క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: కేపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజులో, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంకురా ఆసుపత్రి, 7వ ఫేజులోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. వెస్టర్న్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు..

◆ అదే విధంగా ఎల్లమ్మబండ ఫీడర్ పరిధిలో మరియమ్మ నగర్, పాపమ్మ బస్తీ, మహంకాళి నగర్, శంషీగూడ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కళ్ల కలకతో జాగ్రత్త



ఉచితంగా మందులను అందజేస్తున్న రమేష్, ఆశావర్కర్లు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్ ఏ-బ్లాక్‌లో కండ్ల కలకకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కండ్ల కలకతో అనేక మంది ఇబ్బంది పడుతూ ఆస్పత్రులకు వస్తున్నారని ప్రతి ఒక్కరూ కండ్ల కలక రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్య ఎక్కువైతే సంబంధించిన వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మహిళా నాయకురాలు కె. దుర్గా, ఆశావర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యాదవబస్తీ సమస్యలను పరిష్కరిస్తా



యాదవబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లోని కూకట్‌పల్లి గ్రామంలోని యాదవబస్తీలో ప్రజా సమస్యపై అన్ని విభాగాల అధికారులతో కలిసి గురువారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన రోడ్లు వేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా మంచినీటి పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. యాదవబస్తీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



జ్యోతికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు వీరంగంటి జ్యోతిజగదీష్ గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా ఆమెకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరానన్నారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

హఫీజ్‌పేట్ : పీఎం స్వాన్ నిధి పథకం కింద చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని స్ట్రీట్ వెండర్లకు బ్యాంకు రుణాలను అందిస్తున్నట్లు చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, పీఓ ఉషారాణిలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం స్వాన్ నిధి పథకం కింద సర్కిల్ పరిధిలోని స్ట్రీట్ వెండింగ్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్, బ్యాంకు పాసు పుస్తకం, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ పత్రాలతో సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యవేక్షణ కొరవడి.. గాడి తప్పుతున్న బడి

- ఈ ఇన్‌చార్జ్‌లు అంతా పాఠశాల ప్రధానోపాధ్యాయులు
- ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు 5 నుంచి 7 మండలాల బాధ్యతలు
- జిల్లాలో 505 ప్రభుత్వ, 10 ఎయిడెడ్, 1350 ప్రైవేట్ పాఠశాలలు
- ఈ బడుల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 5.10 లక్షలు
- మండలాల్లో పర్యటనలు లేక చతికిల పడుతున్న విద్యావ్యవస్థ

జిల్లాలో అన్ని మండలాలకు ఎంఈఓలు అంతా ఇన్‌చార్జిలే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు 5 నుంచి 7 మండలాలను అదనపు బాధ్యతగా పర్యవేక్షించాల్సి పరిస్థితి జిల్లా విద్యాశాఖలో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. గతంలో మాదిరిగా ఎంఈఓల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో బడి గాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎంలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో వారు విధులు నిర్వర్తిస్తున్న ఉన్నత పాఠశాలలకు, అటు ఎంఈవో పదవులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు చేపడుతున్నా.. కార్యరూపం దాల్చడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న హెచ్‌ఎంలు తమ బడితో పాటు కనీసం 20 పాఠశాలలను నెలలో పర్యవేక్షించాల్సి ఉన్నా.. అది నెరవేరడం లేదని తెలుస్తోంది.

◆ జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలలు, 10 ఎయిడెడ్ పాఠశాలలు, 1,350 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ఇందులో 5.10 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముగ్గురు ఇన్‌చార్జి ఎంఈఓలు తమ మండలాల పరిధిలోని పాఠశాలల పర్యటనతో సహా అధికారిక కార్యక్రమాలు, మన ఊరు-మన బస్తీ-మన బడి పర్యవేక్షణ, సమీక్షలకు హాజరు కావడం, మధ్యాహ్న భోజన నివేదికలు, మరుగుదొడ్లు, తాగునీరు అదనపు గదుల నిర్మాణాలు, బోధన, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పర్యవేక్షణ, జీతభత్యాలు, నివేదికలు పంపడం వంటి పనులకే వారి సమయం సరిపోతోంది.

◆ జిల్లాలో మొత్తంగా ఉన్న 15 మండలాలకు ముగ్గురు హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. భగత్‌సింగ్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలానగర్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, కూకట్‌పల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తూముకుంట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూడా మేడ్చల్, శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కీసర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూడా మిగిలిన మల్కాజిగిరి, అల్వాల్, ఘట్‌కేసర్, ఉప్పల్, మేడిపల్లి, కీసర, కాప్రా మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయనే విమర్శలు విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ప్రతిష్టంభన..

పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లాస్థాయిలో డీఈవో, సెక్టోరియల్ అధికారులు మాత్రమే చూస్తున్నారు. ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులను ఎత్తివేసింది. రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలులో నెలకొన్న జాప్యంతో పదోన్నతుల ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. ఈ కారణంగా ఎంఈవోల నియామకం జరగడం లేదు. జిల్లాలో మొత్తంగా ఉన్న 15 మండలాలకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తున్నాం

- పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలానగర్ డివిజన్‌లో సమస్యలను నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని కోమటిబస్తీ, చిత్తారమ్మబస్తీ, పాత మీన హోటల్ బస్తీ ప్రాంతాల్లో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజకలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు తాగునీరు, విద్యుత్, రోడ్డులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ముఖ్యంగా కొంతమంది లబ్ధిదారులు పింఛన్లు రావడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులకు పింఛన్లు అందేటట్లు చూడాలని ఆదేశించారు. అదే విధంగా చిత్తారమ్మ బస్తీలో మహిళలు దాదాపు రూ.50 లక్షల విలువ చేసే డబుల్ బెడ్‌రూమ్ కట్టించి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ అందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కొంతమంది అసత్య ప్రచారాలు చేసి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అలాంటి వారి మాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి రూ.కోటి నిధులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురంలోని ముస్లిం శ్మశానవాటిక, మదర్సా అభివృద్ధి పనులను కార్పొరేటర్ సతీష్‌గౌడ్ పర్యవేక్షించారు. మృతి చెందిన వారి దహన సంస్కారాలను చేసేందుకు మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆయన స్పందించి రూ.కోటి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ పవన్‌రెడ్డి, ప్రెసిడెంట్ సయద్ ఇమ్రాన్, సయద్ షౌకత్ ఉల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం

ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయంలో చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, కమిటీ అధ్యక్షుడు మక్కాల అశోక్, సభ్యులు నర్సింగ్‌రావు, రమేష్, సందీప్, నర్సింగ్, వేణు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ

అన్నదానం

మోతీనగర్: వ్యాపారంలోనే కాకుండా సమాజ సేవలో సైతం ఆర్యవైశ్యులు ముందుంటారని తెలంగాణ టూరిజం శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. గురువారం మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులోని వాసవీ కమ్యూనికేషన్ 30వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు దశాబ్దాల క్రితం చిన్న వ్యాపారంగా మొదలు పెట్టి ప్రస్తుతం మోతీనగర్‌కే ఐకాన్‌గా మారిన వాసవీ కమ్యూనికేషన్ రాబోయే రోజుల్లో మరింత దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్, నిర్వాహకులు శ్రీనివాస్ గుప్తా, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, నాయకులు సిహెచ్. సత్యనారాయణ, సత్యం గంగపుత్ర, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న శ్రీనివాస్‌గుప్తా తదితరులు

పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

భాగ్యనగర్‌కాలనీ: శాతవాహననగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి పూర్తి చేయాలన్నారు. రోడ్డుపై నీరు నిలిచి పోకుండా లెవెలింగ్ చేయాలన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి, అందే నరసింహ, కృష్ణమూర్తి, మదన్‌మోహన్, పోశెట్టి గౌడ్, హనుమంత రాజు, కేపీఎస్‌ఎన్ రాజు, సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

వ్యాయామంతో ఆరోగ్యం

- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- బొటానికల్ గార్డెన్‌లో వృద్ధుల వ్యాయామశాల ప్రారంభం

గచ్చిబౌలి: వ్యాయామంతో సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంగా ఉంటారని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వృద్ధుల వ్యాయామశాలను ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఐకాన్‌గా బొటానికల్ గార్డెన్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, డైరెక్టర్ ఎం.జె.అక్బర్, అసిస్టెంట్ డైరెక్టర్ స్కైలాబ్, జీఎం రవీందర్ రెడ్డి, ఓఎస్‌డీటీపీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో వ్యాయామశాలను వృద్ధురాలితో కలిసి ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్,ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

14న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఈ నెల 14న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పాసైన వారు పాల్గొనవచ్చన్నారు. ప్రముఖ బహుళ జాతి కంపెనీలైన ఉషా, సెట్విన్, ఎంటీఆర్, జీఓసీఎల్, జయలక్ష్మీ హ్యుందాయ్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా యువతీ యువకులు, హాజరుకావచ్చని మరిన్ని వివరాలకు 9908849165, 98859 66522 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి

జీడిమెట్ల: అమెజాన్ డెలివరీ బాయ్‌పై దాడి జరిగిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇన్స్‌పెక్టర్ ఎం.పవన్ వివరాల మేరకు మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన షేక్ రెహాన్ ఫయాజ్(20) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గాజులరామారంలోని ఇందిరానగర్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని నెలలుగా ఫయాజ్ అమెజాన్ సంస్థలో వస్తువులను వినియోగదారులకు అందించేందుకు డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు.

◆ ఈనెల 5వ తేదీన కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో వస్తువులను అందించేందుకు వచ్చాడు. ఓ ప్రాడక్ట్‌ను వినియోగదారునికి ఇచ్చేందుకు ఫోన్ చేయగా వాట్సప్ ద్వారా లోకేషన్ పంపాడు. సదరు అడ్రస్‌కు వెళ్లి వస్తువును ఇవ్వగా డెలివరీలో జాప్యం జరిగిందని గొడవ జరిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆరుగురు వ్యక్తులతో పాటు విశాల్ అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు బాధితుడు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆ గొడవకు నాకు సంబంధం లేదు: విశాల్

నాకు గొడవకు ఎలాంటి సంబంధం లేదు. సదరు వ్యక్తి మా కాలనీకి వచ్చి పార్కు వద్ద గంజాయి సేవించిన మత్తులో ఉన్నాడు. దీంతో బయట ఉన్న యువకులు సదరు వ్యక్తి దొంగతనానికి వచ్చినట్లుగా అనుమానంతో దాడి చేశారు. నాకు సంబంధం లేకపోయిన కొంతమంది కావాలని నేను దాడి చేసినట్లు పీఎస్‌లో ఫిర్యాదు చేయించారు.

ప్రభుత్వ పాలనాశాస్త్రంలో మార్పులు అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: మారిన టెక్నాలజీకి అనుకూలంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వ పాలనాశాస్త్రంలో మార్పులు అవసరమని కేంద్ర హోంశాఖ మాజీ సెక్రటరీ, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఛైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత పద్మనాభయ్య (ఐఏఎస్ మాజీ అధికారి) పేర్కొన్నారు. గురువారం దూరవిద్య కేంద్రంలో ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ డిజిటల్ ఎర ఇష్యూస్, ఛాలెంజస్ అండ్ ప్రాస్పెక్ట్ అనే అంశంపై రెండు రోజుల జరిగిన జాతీయ సదస్సుకు సోషల్ సైన్స్ డీన్ ప్రా.స్టివెన్ సన్ అధ్యక్షత వహించగా కె.పద్మనాభయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. విశ్రాంత ప్రొఫెసర్లు హరగోపాల్, గట్టు సత్యనారాయణ, సోఫిఅలీ, మోహన్‌రావు, ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి ప్రసంగించారు. అనంతరం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ ప్రొ.బాలబ్రహ్మచారి, బీవోఎస్, సదస్సు కన్వీనర్ ప్రొ.అరుణజ్యోతి, డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ తిరుపతి, డాక్టర్ మనోహర్, డాక్టర్ రమణరావు, డాక్టర్ రవితేజా, పరిశోధన విద్యార్థులు పద్మనాభయ్యతో గ్రూప్ ఫొటో దిగారు.

టీఏఎస్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో హెచ్‌సీయూ ప్రొఫెసర్

రాయదుర్గం: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఏపీఏఎస్) 1963లో ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఇది కాస్తా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్)గా మార్చడం జరిగింది. ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు పరిశోధనా బృందం న్యూరో క్లినిషియన్‌ల సహకారంతో మెదడు వ్యాధుల ప్రాంతంలో పనిచేస్తోంది. న్యూరో డీజెనరేటివ్ వ్యాధులు, సెరిబ్రల్ ఇస్కీమియా(స్ట్రోక్) సెరిబ్రల్ మలేరియా ప్రధాన పరిశోధనలు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

మోజ్ ఆధ్వర్యంలో వినోద పోటీల ఫైనల్స్ 13న

సాక్షి, సిటీబ్యూరో: షార్ట్ వీడియో కంటెంట్‌కు పట్టం కట్టే వేదిక మోజ్ యాప్ ఆధ్వర్యంలో పాటలు, వినోద కార్యక్రమాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో చిన్ననాటి జ్ఞాపకాలను ఒక థీమ్‌గా, ఫర్మాయిష్/సాంగ్ రిక్వెస్ట్ రెండో థీమ్‌గా, తుది పోటీ కోసం 90లు వర్సెస్ 2000 థీమ్‌లుగా నిర్ణయించామని తెలిపారు. ఈ పోటీల ఫైనల్స్ ఈ నెల 13 దాకా కొనసాగుతాయని ఆసక్తి కలిగిన నగరవాసులు పాల్గొనాలని కోరారు.

13న బాల బృందావనం

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'ది స్టోరీ ఆఫ్ రియల్ ఇండిపెండెన్స్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

నాన్ టీచింగ్ పోస్టులకు రాత పరీక్ష

రాయదుర్గం: మనూలో నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. లోయర్ డివిజన్ క్లర్క్, సెక్షన్ ఆఫీసర్, మెయింటెనెన్స్ అసిస్టెంట్ పోస్టులకు ఆగష్టు 19వ తేదీ, ల్యాబ్ అటెండెంట్, సీనియర్ రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు ఆగష్టు 20 ,21వ తేదీలలో పరీక్షలు నిర్వహిస్తారు.అభ్యర్థులు మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

20న దళితుల ఐక్యవేదిక ఎన్నికలు

మూసాపేట: కూకట్‌పల్లి జంట సర్కిల్ దళితుల ఐక్యవేదిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు దళితుల ఐక్యవేదిక ఎన్నికల కమిటీ చైర్మన్ కర్క పెంటయ్య, సభ్యులు సపారి చంద్రశేఖర్ తెలిపారు. మూసాపేటలో గురువారం సమావేశం నిర్వహించి, నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నామినేషన్ పత్రాల స్వీకరణ శుక్రవారం ఉంటుందన్నారు. ఈనెల 13న నామినేషన్ల విత్ డ్రా, 14వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. 20వ తేదీన పోలింగ్ అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు సింగూరి పాండు, బోడ నర్సింగ్‌రావు, ఎస్పీ లక్ష్మణ్, పి.యాదయ్య, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా కేసీఆర్ ఉండటం ఉద్యోగుల అదృష్టం

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణకు సీఎంగా కేసీఆర్ ఉండటం ప్రభుత్వ ఉద్యోగులకు అదృష్టమని, వారికి అన్ని విధాలుగా న్యాయం జరుగుతోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిన్నటి గ్రామ రెవెన్యూ సహాయకులు – నేటి ప్రభుత్వ ఉద్యోగులు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని 131 మంది వీఆర్‌ఏలకు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ ప్రజలు, ఉద్యోగుల శ్రేయస్సు కోసం పరితపిస్తుంటారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. అలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండటం ప్రభుత్వ ఉద్యోగుల అదృష్టమని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులుగా విధులు నిర్వహించిన సమయంలో రూ.11,500 వేతనం ఉండగా ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు, వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇలాంటి గొప్ప నిర్ణయాలు తీసుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు 81 ప్రకారం వీఆర్‌ఏల విద్యార్హతల ఆధారంగా వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, హెల్పర్లు, వార్డు మెంబర్లుగా నియమించడం జరిగిందన్నారు.